# చిత్ర కదంబం

## సినీ బఠాణీలు

### ఏరుకొచ్చినవారు - సినీజ్ఞా నానందమహర్షి

## కాంచనమాల స్పెషల్



ఆ సాయంత్రం

రాక్సీలో నార్మా షేరర్

బ్రాడ్వే లో కాంచనమాల

ఎటకేగుటో సమస్య తగిలిందొక విద్యార్థికి..

అంటూ శ్రీశ్రీ మహాప్రస్థానంలోనూ, అటుతర్వాత ఆయనే వ్రాసిన ఖడ్గసృష్టిలోనూ కూడా చోటుచేసుకున్న ఒకే ఒక తెలుగు సినీతార కాంచనమాల..!

కాంచనమాల స్వస్థలం తెనాలి దగ్గర ఉన్న ఐతవరప్పాడు. తండ్రి పేరు దాసరి నారాయణ దాసు.

***



తెలుగుసినిమా హీరోయిన్‌కి స్టార్డమ్ అన్న ఖ్యాతిని తీసుకొచ్చిన మొట్టమొదటి తెలుగు సినీ కథానాయిక కాంచనమాల. ఆవిడ సినీ జీవితం కేవలం 7 సంవత్సరాలు మాత్రమే కొనసాగింది, 1935 నుంచీ 1942 దాకా. అందులో ఆమె నటించిన చిత్రాలు 12 దాటలేదు.! అయినా ఈ నాటికీ ఎన్ని తరాల ప్రేక్షకులు మారినా ఆమె కున్న పేరు మాత్రం చెక్కుచెదరలేదు.!

***

కాంచనమాల తొలిచిత్రం 1935 లో నిర్మించబడిన శ్రీకృష్ణతులాభారం. ఇందులో ఆమె మిత్రవింద పాత్రధరించారు. సత్యభామగా ఋష్యేంద్రమణి, రుక్మిణిగా గుంటూరు సంభారంజని, శ్రీకృష్ణుడుగా జయసింగ్ నటించారు. సి.పుల్లయ్య దర్శకుడు. 'భలే మంచి చౌకబేరమూ..' లాంటి ఈ నాటికీ ప్రజాదరణలో ఉన్న పాటలని ఒరిజినల్ నాటక రచయిత ఐన చందాల కేశవదాసు గారు ఈ సినిమా కోసమే మొట్టమొదటి సారి వ్రాశారు.

***



'బాలనాగమ్మ' షూటింగ్ సందర్భంలో జెమినీ వాసన్‌తో వచ్చిన వివాదం ఈమె నటజీవితానికి చరమగీతం పాడింది. ఈమె దురుసుగా మాట్లాడ్డం, జెమినీ వాసన్ తన వద్దనున్న కాంట్రాక్టు కాగితాలని చూపించి ఆమెని బెదిరించడం లాంటి పరిణామాల వల్ల విపరీతంగా మనస్తాపానికి గురైన కాంచనమాల ఎలాగో ఆ సినిమా పూర్తిచేసేసి, 1942 లో మద్రాసు వదిలేసి తెనాలి చేరుకున్నారు. ఆ తరువాత కొన్నేళ్ళకే భర్త గాలి వెంకయ్య మరణించడంతో మతి చలించింది అని అంటారు కొందరు.. మరి కొన్నేళ్ళకి కాస్త తేరుకుని తెనాలి సత్యనారాయణ టాకీస్‌కి చెందిన శివలింగ ప్రసాద్ గారితో కలిసి మళ్ళీ మద్రాసు వెళ్ళి సొంతంగా సినిమా తీద్దామని సన్నాహాలు చేశారు. ఆరేళ్ళ తర్వాత మళ్ళీ కాంచనమాల సొంత చిత్రం 'అనాథబాల' తో తెరమీదికి వస్తోందని పత్రికలుకూడా వ్రాశాయి. కానీ ఆ ప్రయత్నాలూ ఫలించలేదు.

***

'బాలనాగమ్మ' గొడవ తరువాత ఆమె తరఫు లాయరు శేషాచార్యులు కాంచనమాలతో 'సక్కుబాయి' నాటకం వేయించారు. అనుకున్నంతగా ప్రేక్షకులు విరగబడలేదు. వచ్చిన కొద్ది మంది ఆమె పట్ల జాలి మాత్రమే ప్రకటించారు. ఐతే కాంచనమాల గాభరా, హడవిడి చూసి ఆమె చెల్లెలూ, మరిదీ ఆ నాటకాలని ఆపించేశారు.

***

ఆమె బంధువూ, సన్నిహితురాలూ అయిన లక్ష్మీ రాజ్యం 1963లో 'నర్తనశాల' సినిమాలో కంచనమాల తో ఒక చిన్న వేషం వేయించారు. అలా ఐతే నైనా మామూలు లోకంలోకి వస్తారేమోనని ఆమె ఆశ. ఆమె ఆశ అడియాసగానే మిగిలిపోయింది. కాంచనమాల సెట్ మీదికి వచ్చినా చాలా యాంత్రికంగా అసలు ఈ లోకంలోనే లేనట్లు ప్రవర్తించారు. అదే ఆమె ఆఖరి సినిమా.!



***

1938 లో మాలపిల్ల సినిమాలోని కాంచనమాల స్టిల్‌తో ఒక కేలండర్ విడుదలైంది. అప్పట్లో తెలుగువారి అందరి ఇళ్ళల్లోనూ ఆ కేలండర్ ఉండడం ఒక ప్రిస్టేజ్! సంవత్సరాలు మారినా ఆ కేలండర్ ని మాత్రం గోడమీదినుంచీ తొలగించని వాళ్ళు ఎంతో మంది ఆ రోజుల్లో.!

***

1938 ప్రాంతల్లో వడ్లబస్తా 3 రూపాయలు ఉండేది. అప్పట్లో కాంచనమాల పారితోషికం చిత్రానికి 10 వేల రూపాయలు..!!

***

కాంచనమాల సినిమా కెరీర్‌లో ఉచ్చ స్థాయిలో ఉండగానే 1940 లో తెనాలి నాజర్ పేటలో ఒక అందమైన మేడ కట్టుకున్నారు. 1942 లో కాంచనమాల సిని జీవితానికి తెరపడ్డాక 40 సంవత్సరాలు అందులోనే అజ్ఞాతంగా గడిపారామె. కొంతమంది ఆమెకి మతిచలించింది అనేవారు. తను మాత్రం



నిరాసక్తంగా, నిస్తేజంగా ఎవరూ పట్టనట్లు గడిపారన్ని సంవత్సరాలూ. ఎవరైనా సినీ రంగానికి సంబంధించిన వ్యక్తులు పలకరించడానికి వెళితే, పాత విషయాలేమీ గుర్తుపట్టనట్లే ఉండేవారు.

***

1981 లో మద్రాసులో కాంచనమాల శాశ్వతంగా కన్నుమూసారు. ఆవిడ మృతకళేబరాన్ని స్మశానానికి తీసుకువెళుతున్నప్పుడు పట్టుమని పదిమంది కూడా సినీపరిశ్రమ వ్యక్తులు లేరు.. ఇది చిత్రసీమ..! విచిత్ర సీమ..!!

## సినీ సంగీతం - ప్రఖ్యాత వాయిద్యకారుల సహకారం

| చిత్రం | సంగీత దర్శకుడు | పాట | వాయిద్యం | కళాకారుడు |
|---|---|---|---|---|
| మురిపించే మువ్వలు | యస్.యస్.సుబ్బనాయుడు | నీలీల పాడెద దేవా | సన్నాయి | కారై కురిచ్చి అరుణాచలం |
| డా.చక్రవర్తి | రాజేశ్వరరావు | పాడమని నన్నడుగవలెనా | వీణ | చిట్టిబాబు |
| సీతారామ కళ్యాణం | గాలిపెంచల | నేపథ్యం | వీణ | ఈమని శంకరశాస్త్రి |
| పూజాఫలం | రాజేశ్వరరావు | | వయొలిన్ | పోరూర్ గోపాలకృష్ణన్ |
| సప్తపది | మహదేవన్ | ఇదేనా మోహన మురళి | ఫ్లూట్ | నంజుండప్ప |
| సిరివెన్నెల | మహదేవన్ | విధాత తలపున | ఫ్లూట్ | హరిప్రసాద్ చౌరసియా |

## *సినిమాల్లో ఆత్రేయ రాసిన పాటల్లోని మంచి వాక్యాలు*



ఊరు చాలా పెద్దదయా
హృదయమేమొ చిన్నదయా
పక్కవాడు ఏమైనా
పట్టిచావని పట్టణమయ్యా..

*శభాష్ సూరి (1964)*



(దేవుడు..)

పిడికెడు హృదయం ఇచ్చాడు

కడివెడు ప్రేమను నింపాడు

అడుగున ద్వేషం దాచాడు

అడకత్తెరలో నొక్కాడు

*శభాష్ సూరి (1964)*

తనువుకెన్ని గాయాలైనా

మాసిపోవు నేలాగైనా

మనసుకొక్క గాయమైనా

మాసిపోదు చితిలోనైనా

*ఆడబతుకు (1965)*



నీవు నిండుగ నవ్వినపుడే నాకు నిజముగ తెల్లవారును

నా కాపురాన రేపుమాపులు కలవురా నీ చూపులోనే

*ఇల్లాలు (1965)*

దేవుడు నేనై పుట్టాలి

దేన్నో తాను ప్రేమించి

ఆడదాని మనసంటేనే

విషమనీ తెలిసీ ఏడ్వాలి

*తేనెమనసులు (1965)*

అమ్మకన్నులు తమ్మిపూవుల్లు

తమ్మిపూవులు పూయు తలిరు వెన్నెల్లు

ఆ వెన్నెలను మూసేనే కన్నీటి జల్లు

కన్నీరు రానీకు కరుగునెడదల్లు

*తోడు - నీడ (1965)*



మానవుల కన్నీరు మాన్పగా నెంచి
మహరాజు భిక్షువై బయలుదేరాడు
మనసునిచ్చిన మగువ మమత కన్నీరుగా
పారించి అడవులకు పారిపోయాడు

*సుమంగళి (1965)*

అంధుని ఎదుట అందాలేలా?
అడవిని పున్నమి వెన్నెలలేలా?
అసమర్థున కవకాశాలేలా ?

*సుమంగళి (1965)*